ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 10 మే 2025



జీపీవోల నియామకానికి కసరత్తు



- వచ్చే నెల నుంచి భూభారతి చట్టం అమల్లోకి..
- పూర్వ వీఆర్వో, వీఆర్ఏల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామానికో అధికారి
- 110 దరఖాస్తుల రాక, స్ర్కీనింగ్ టెస్టు ద్వారా ఎంపిక

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామానికి ఒక పాలనాధికారి (జీపీవో)ను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ)గా పనిచేసిన వారిలో ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. వీఆర్వోల నుంచి 39 మంది, వీఆర్ఏల నుంచి 71 మంది, మొత్తం 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే వారంలో వీరికి స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించి ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015లో రెవెన్యూ చట్టంలో మార్పులు, చేర్పులు చేసేందుకు భూ ప్రక్షాళన చేపట్టిన విషయం తెలిసిందే. పాత పట్టాదారు పాసు పుస్తకాల స్థానంలో హైసెక్యూరిటీ పాసు పుస్తకాలను ప్రభుత్వం జారీ చేసింది. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చాలా వకు తప్పిదాలు జరిగాయి. పట్టాదారుల పేర్లు, సర్వే నంబర్లు తప్పుగా రావడం, విస్తీర్ణం ఎక్కువ, తక్కువ చూపడం, తదితర తప్పులు దొర్లాయి. అవే తప్పులతో భూముల వివరాలన్నింటికీ కంప్యూటరైజ్డ్ చేశారు. తప్పొప్పుల సవరణకు అవకాశం ఇవ్వకుండానే ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకు వచ్చింది. భూముల వివరాలను పోర్టల్‌లో పెట్టింది. ఆ వివరాలను ఎవరైనా చూసు కునే వీలు కల్పించింది. పహాణి పుస్తకాల్లో అనుభ వదారు పేరు, కబ్జా కాలాన్ని తొలగించింది. తహ సీల్దార్ కార్యాలయాల్లోనే వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే మ్యుటేషన్ పూర్తి చేసి వారం, పది రోజుల్లో పట్టాదారు పాసు పుస్తకం ఇంటికి వచ్చేలా చేశారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చారు. ధరణి పోర్టల్‌లో పట్టాదారులుగా ఉన్న వారు మాత్రమే భూములను

(మిగతా 8వ పేజీలో)

● జిల్లాలో 215 రెవెన్యూ గ్రామాలు..

ధరణితో రైతులు, వివిధ వర్గాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం దాని స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చింది. దీని ద్వారా తహసీల్దార్లు, ఆర్డీవోలు, రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్లకు సైతం కొన్ని అధికారాలను కట్టబెట్టారు. భూ రికార్డులను ఆన్‌లైన్‌లోనే గాకుండా మ్యాన్యువల్‌గా కూడా నమోదు చేయనున్నారు. రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలించేందుకు గాను గ్రామానికి ఒక పరిపాలనాధికారిని నియమించాలని నిర్ణయించింది. జిల్లాలో 215 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఒక్కో అధికారిని నియమించనున్నారు. ఇందుకు మొదట పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలకు అవకాశం ఇచ్చింది. డిగ్రీ పూర్తి చేసిన వీఆర్వోలు, ఇంటర్ పూర్తి చేసి ఐదేళ్ల అనుభవం ఉన్న వీఆర్ఏలు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఆ మేరకు జిల్లాలో 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి వివరాలను జిల్లా అధికారులు సీసీఎల్ఏకు పంపించారు. భూభారతి చట్టం వచ్చే నెల 3వ తేదీ నుంచి అమల్లోకి రానున్నందున ఆ లోపు గ్రామ పాలనాధికారులను నియమించనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే వారంలో స్ర్కీనింగ్ టెస్టు నిర్వహించి నియమించనున్నారు.

సీపీని కలిసిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

కోల్‌సిటీటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిషోర్ ఝూని శుక్రవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీకి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా సీపీ దృష్టికి తీసుకువెళ్లారు. సీపీని కలిసిన వారిలో ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తాజా మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, మైస రాజేష్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపరింటెండెంట్ ఈర్ల సురేందర్, దాసరి సతీష్ ఉన్నారు.

సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

పాలకుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి సూచించారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బామ్లానాయక్ తండా, రాజీవ్ తండాలో శుక్రవారం ఎస్ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 20 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం స్టేషన్ ఆవరణలో సిబ్బందికి ఏకరూప దుస్తులను ఎస్ఐ పంపిణీ చేశారు.

ఎన్టీపీసీ ప్లాంటులో.. విపత్తు జరిగితే ఎదుర్కొంటాం

- రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ
- సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

7



ఎన్టీపీసీ ప్లాంటులో సీఐఎస్ఎఫ్ జవానుల మాక్ డ్రిల్

భూసమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు

కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎలిగేడు, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వస్తున్న భూసమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలో ఎలిగేడు మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. భూభారతి చట్టం కింద భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మే 19 వరకు ఉన్న షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూరికార్డుల సమస్యలు ఉంటే ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎలిగేడు మండలంలో ఇప్పటివరకు 614 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలనుంచి వచ్చే దరఖాస్తులను ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా పరిష్కరించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, కోర్టు సమస్యలు, కుటుంబ వివాదాలు మినహాయించి మిగిలిన భూసమస్యలను జూన్ 2లోపు పరిష్కరించేలా కార్యాచరణ అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ బషరోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

● కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంపై జిల్లాలోని ఎలిగేడు మండలంను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈనెల 5వ తేదీన ప్రారంభమైన రెవెన్యూ సదస్సులో ఇప్పటివరకు ఎలిగేడులో 181, బురహాన్‌మియాపేటలో 96, లాలపల్లిలో 105, నర్సాపూర్‌లో 145, నారాయణపల్లిలో 46, సుల్తాన్‌పూర్‌లో 53, ధూళికట్టలో 55చొప్పున రైతులు భూసమస్యలపై దరఖాస్తులను అధికారులకు అందజేశారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చర్యలు: ఎస్ఐ

ఓదెల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారుల వెంట ధాన్యం రాసుల వల్ల ప్రమాదాలు జరిగితే కారకుడైన సంబంధిత రైతుపై చర్యలు తీసుకుంటామని పొత్కపల్లి ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. శుక్రవారం ఎస్ఐ రమేష్ విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై వరి, మొక్కజొన్న ధాన్యం పోయడం వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందన్నారు. ధాన్యం రోడ్లపై ఆరబెట్టడంవల్ల ఇంతకుముందు ఓదెల నుంచి కొలనూర్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డులో ధాన్యం కుప్పను ఢీకొని ఓ బ్యాంక్ ఉద్యోగి మృతి చెందాడన్నారు. మడకనైపు రోడ్డులో ధాన్యం కుప్ప వల్ల ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయన్నారు. గుండ్లపల్లి నుంచి గుంపుల, గూడెం వరకు, ఓదెల నుంచి కొలనూర్ వరకు ఉన్న డబుల్ రోడ్డులో ధాన్యం కుప్పలు పోయవద్దని, రాళ్లు కూడ పెట్టవద్దని రైతులను సూచించారు.

రోడ్లు పగులగొట్టడంపై ఎమ్మెల్యే సీరియస్

- కాంట్రాక్టర్, సూపర్‌వైజర్‌పై చర్యలకు ఆదేశం
- విచారణ జరుపుతున్న పోలీసులు

కోల్‌సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్టీపీసీలో సిమెంట్ రోడ్డు పగులగొట్టడంపై ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సీరియస్‌గా స్పందించారు. గురువారం ఎన్టీపీసీ కృష్ణానగర్ సమీపంలో ఒక శుభకార్యానికి వెళ్లిన ఆయన ఆ ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పేర కొన్ని నెలల క్రితం వేసిన సీసీ రోడ్డు పగులగొట్టడమేమిటని ప్రశ్నించారు. మంచినీటి పైప్‌లైన్లు నిర్మించిన తరువాత సీసీ రోడ్డు వేయాలని అధికారులకు చెప్పామన్నారు. అక్కడి నుంచే ఈఈ రామన్‌కు ఫోన్ చేసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు లేక జనం ఇబ్బంది పడుతున్నారని నిధులు మంజూరు చేయించుకువస్తే రోడ్డు పలుగగొట్టి మళ్లీ వారిని ఇబ్బందులకు గురి చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్, వాటర్ సప్లై సూపర్‌వైజర్‌పై కేసులు నమోదు చేయాలంటూ పోలీసులకు సూచించారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎవరు ధ్వంసం చేసినా, పగులగొట్టినా మున్సిపల్ చట్ట ప్రకారం భారీ జరిమానాలు విధిస్తామని కార్పొరేషన్ కమిషనర్ ఇప్పటికే ప్రకటించారు. కార్పొరేషన్ కాంట్రాక్టర్ విశ్వతేజ, వాటర్ సప్లై సూపర్‌వైజర్ శశిని ఎన్టీపీసీ పోలీసులు పిలిచి విచారించారు. గురు, శుక్రవారాల్లో ఠాణాలకు పిలిచారు. ఈ వ్యవహారం మున్సిపల్ కార్పొరేషన్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కాగా ఈ వ్యవహారంపై కొందరు కాంట్రాక్టర్లు కార్పొరేషన్ కమిషనర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు.

జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్



రామగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను జూనియర్ కళాశాలగా ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో అప్‌గ్రేడ్ చేపట్టారు. ఈ మేరకు సర్క్యులర్ విడుదల చేశారు. జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, కంప్యూటర్ సైన్స్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రూప్‌లో 40 సీట్ల చొప్పున విద్యార్థుల భర్తీకి అవకాశం ఉంది. 2025-26 సంవత్సరానికి మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థినులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, టెన్త్ మెమోతో కేజీబీవీ కళాశాలలో సంప్రదించాల్సిందిగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు.

భారత సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

మంథని, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత సైనికులకు మద్దతుగా మంథని పట్టణంలో శుక్రవారం సాయంత్రం ప్రజలు భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. దేశ, ప్రజల రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు అండగా మేము ఉన్నామంటూ.. జాతీయ జెండాలను చేతబూని.. జైజవాన్, జైహింద్ అంటూ.. సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. స్థానిక గాంధీచౌక్ నుంచి బస్టాండ్, పూలే, అంబేద్కర్, శ్రీపాద విగ్రహాల మీదుగా భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు ర్యాలీలో పాల్గొని దేశ సైనికుల త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు అధికా సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన పారిశుధ్య సిబ్బందికి రివార్డు

- పారిశుధ్య నిర్వహణకు వంద రోజుల కార్యాచరణ - కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ



ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణతో పాటు అన్నీ మున్సిపల్ సేవలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు పర్చనున్నట్లు కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో పాటు వార్డు ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. రాబోయే వర్షాకాల సీజన్‌లో ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నాలాల్లో పూడిక తొలగింపు, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, దోమల నివారణ తదితర చర్యలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తమ సేవలు అందించిన పారిశుధ్య సిబ్బందికి రెండు వేల రివార్డును అందజేస్తామని తెలిపారు. డివిజన్లలో పారిశుధ్యం, ప్రభుత్వ పథకాల అమలు, మున్సిపల్ సేవలు, క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును ఎప్పుకప్పుడు వార్డు ఆఫీసర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందే వార్డు ఆఫీసర్లు గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డుల సర్వే పూర్తి చేసి జాబితా సమర్పించాలని సూచించారు. ఎర్లీబర్డ్‌లో రాష్ట్రంలోనే రామగుండం కార్పొరేషన్‌కు గుర్తింపు రావడానికి రెవెన్యూ అధికారుల సమష్టి కృషి కారణమని అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన రెవెన్యూ అధికారులకు అరుణశ్రీ మెమొంటోలు అందజేశారు. ఈ సమీక్ష సమావేశంలో డీసీ వెంకటస్వామి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో తాగునీటి కొరత

- ఇబ్బంది పడుతున్న రోగులు - వాటార్ బాటిళ్లే దిక్కు



ఆసుపత్రిలో చికిత్స కోసం వేచి చూస్తున్న రోగులు

కళ్యాణ్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తాగునీరు లేక రోగులు అల్లాడుతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో మంచి నీరు దొరకక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రికి వైద్యం కోసం నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారు. కానీ వారికి కనీసం మంచినీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. పాత బిల్డింగ్‌లో వివిధ చికిత్సల కోసం వచ్చే రోగులకు అందుబాటులో మంచినీరు లేక పోవడంతో దుకాణాల్లో వాటర్ బాటిళ్ల కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఓపీ, స్కానింగ్ సెంటర్ల వద్ద కౌంటర్ల వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. స్కానింగ్ తీసే సమయంలో తప్పనిసరిగా నీరు తాగిన తరువాతనే స్కానింగ్ చేస్తామని వైద్యులు చెబుతుండడంతో బయట వాటర్ బాటిళ్ల కొనుగోలు చేస్తున్నారు. గతంలో కింద వాటర్ ఫ్రిజ్ ఉన్నప్పటికీ దానిని తొలగించి రెండవ అంతస్థులోని పిల్లల వార్డు వద్దకు మార్చడంతో అక్కడికి వెళ్లలేక, నీళ్లు తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. జనరల్ వార్డుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరగడంతో సరిపడా మంచినీరు లేక పోవడంతో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. ఇప్పటికైనా గ్రౌండ్ ఫ్లోర్‌లో మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసి రోగుల దాహార్తిని తీర్చాలని రోగులు కోరుతున్నారు.

ఆలయ భూముల కౌలు కోసం వేలంపాట

ఓదెల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి క్షేత్రం పరిధిలోని ఇనామ్ భూములను కౌలుకు ఇవ్వడం కోసం ఈనెల 17న, సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు వేలంపాటను నిర్వహిస్తున్నట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 965 లోని 7.38 ఎకరాలు, సర్వే నంబర్ 1120లోని 25 గుంటలు, సర్వే నంబర్ 1124లోని 1.20 ఎకరాలను కౌలుకు ఇచ్చేందుకు వేలం వేస్తామని ఈవో తెలిపారు. అలాగే గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ పరిధిలో గల భూములు సర్వేనంబర్ 872 లోని 3.01 ఎకరాలు, 913 సర్వేనంబర్‌లోని 2.10 ఎకరాల భూములను కౌలు సాగుకు వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనే రైతులు ముందుగా డిపాజిట్ సొమ్మును చెల్లించాలని 2005 జూన్ 1 నుంచి 2026 మే 31 వరకు దీని కాల పరిమితి ఉంటుందన్నారు. ఉత్సాహం ఉన్న రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఈవో కోరారు.

వాహనాలు, హమాలీల కొరత రాకుండా చర్యలు

- అదనపు కలెక్టర్ డి వేణు - 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఓదెల, మే 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డి వేణు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కొనుగోళ్లలో జాప్యం-పేరుకుపోతున్న ధాన్యం' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఓదెలలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్య కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ వేణుతో పాటు సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్, డీసీవో శ్రీమాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణు మాట్లాడుతు, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నామ న్నారు. ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యం చేయవద్దని, కేంద్రాల్లో హమాలీల సమస్యలు రాకుండా చూసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు అవసరమైతే టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. రైతులకు మద్దతు ధరతో పాటు సన్నరకం ధాన్యానికి ఐదువందల రూపాయల బోనస్ డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్య కొనుగోలుతో పాటు తూకం, లోడింగ్ వేగవంతం చేయాలని కోరారు. అలాగే మండలంలోని ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరుగుతోందని తెలిపారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, సీసీ విజయ, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



ఓదెల సొసైటీ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలో గుడిపెల్లి, బసంత్‌నగర్ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ డి వేణు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాలు కురిసి నష్టం జరగకముందే కొనుగోళ్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీడీవో బి రాజేందర్,డిప్యూటి తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువతి బలవన్మరణం


కవిత (ఫైల్)

ఇల్లందకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన మేకల కవిత(30) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఉన్నతచదువులు చదివి పలుఉద్యోగాలకు పోటీపరీక్షలు రాసింది. ఈక్రమంలో కుటుంబసభ్యులు అమ్మాయికి పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. ఇటీవల కవితకు పెళ్లి సంబంధం చూశారు. కానీ కవిత ఇప్పట్లో నేను పెళ్లి చేసుకోను అని చెప్పింది. పెళ్లిపై ఇష్టం లేక గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీ ఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి తండ్రి మేకల సారయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మిడిదొడ్డి వెంకటేష్(31) మతిస్థిమితం లేక మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపతి నరేష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ కటింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా మతిస్థిమితం లేక మద్యానికి బానిసైనట్టు తెలిపారు. దీంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య మౌనిక ఉన్నట్టు తెలిపారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి


మల్లేశం (ఫైల్)

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారు కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గన్నేరువరానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి న్యాత మల్లేశం(55) శుక్రవారం గుండె పోటుతో మృతిచెందాడు. మల్లేశంకు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు మృతి


రాజుబాయి(ఫైల్)

రాయికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన మామిడి రాజు బాయి (85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందింది. రాజుబాయికి మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 5న కుటుంబసభ్యులకు తెలియకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మృతురాలి మనువడు మామిడి సంజీవ్ ఫిర్యాదు మేరకు రాయికల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా రాయికల్ గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు చనిపోయి కనిపించింది. మృతురాలు మతి స్థిమితం సరిగా లేనందున ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయి ఉండవచ్చునని మృతురాలి కుటుంబసభ్యులు తెలుపగా రాయికల్ ఎస్సై సుధీర్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈత వనం దగ్ధం


దగ్ధమైన ఈత వనంలో గీత కార్మికులు

గంభీరావుపేట (ముస్తాబాద్), మే 9 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె గ్రామంలో గౌడ సంఘానికి చెందిన ఈతవనం దగ్ధమైంది. సమీప వ్యవసాయ పొలంలో కొయ్యకాళ్లను తగలబెడుతున్న క్రమంలో ఈతవనంకు మంటలు వ్యాపించడంతో దాదాపు 300 ఈత, తాటిచెట్లు దగ్ధమయ్యాయి. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు బైరి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బండి లక్ష్మణ్‌గౌడ్, నర్సాగౌడ్, అంజాగౌడ్, భాస్కర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాములు గౌడ్ కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలు

బీర్‌పూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బీర్‌పూర్ మండలం లోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన పూదూరి విజయ్ కుమార్ శుక్రవారం కమ్మునూర్ బ్రిడ్జి నుంచి బీర్‌పూర్ వైపు వె ళ్తుండగా కమ్మునూర్ చౌరస్తా వద్ద వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన గ్రామస్థులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

పసుపు సాగుకు జై..

- ఈ సీజన్‌లో జగిత్యాల జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగు అంచనా
- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- విత్తన పసుపునకు భలే డిమాండ్
- క్వింటాలుకు రూ.6 వేల చొప్పున విక్రయం

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో పచ్చబంగారం సాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలకరి రాగానే జూన్ మొదటి వారంలో పసుపు విత్తడం ఆరంభమవుతుంది. రైతులు ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఐదేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ రాగా ఈసారి మాత్రం పసుపు పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో గిట్టుబాటు ధర దక్కక సాగుకు దూరమైన వారు తిరిగి వేసేందుకు ఆలోచన చేస్తున్నారు. ఈ సీజన్‌లో అనూహ్యంగా రికార్డు స్థాయి ధరలు నమోదు కావడంతో పసుపు రైతుల్లో ఆశలు పెంచింది. రైతులు ప్రస్తుతం విత్తనం సేకరించే పనుల్లో ఉన్నారు.





ఐదేళ్ల తర్వాత మార్పు

జగిత్యాల జిల్లాలో గడిచిన నాలుగు, ఐదు సంవత్స రాల్లో 35 వేల నుంచి 40 వేల ఎకరాల్లో సాగు అయ్యేది. మద్ద తు ధరలు అంతంత మాత్రం గానే ఉండడంతో గత సీజన్‌లో 25 వేల ఎకరాలకు పడి పోయింది. ప్రస్తుత సీజన్‌లో పసుపు ధర పుంజుకొని సరాసరి రూ.13 వేల నుంచి రూ. 20 వేల వరకు ధర పలి కింది. కొమ్ముకే కాదు, మండ పసుపుకు కూడా డిమాండ్ రావడంతో రైతులను ఇటు వైపు మొగ్గు చూపేలా చేస్తోందని అధికారులు అంటున్నారు. పసుపునకు ఆశించిన ధర రావడం, పసుపు బోర్డు ఏర్పాటు కావడం తదితర కారణాల వల్ల ఈ ఏడాది గతంలో కంటే సాగు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో పసుపు సాగు అయ్యే అవకాశాలున్నాయని వ్యవసాయ, ఉద్యా నవన శాఖ వర్గాలు అంటున్నాయి.

చిగురిస్తున్న ఆశలు

పసుపు రైతులకు ఈ ఏడాది వరస నష్టాల నుంచి ఉపశమనం లభించింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కడంతో చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. రైతుల్లో సాగుపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఈసారి సాగు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశాలు కనిస్తున్నాయి. దీంతో విత్తన పసుపునకు డిమాండ్ ఏర్పడింది. గతేడాది క్వింటాకు రూ. 4 వేలు ఉన్న విత్తన పసుపు ధర ఇప్పుడు రూ.6 వేలు పలుకుతోంది. కొనుగోలుకు పసుపు రైతుల్లో ఆసక్తి ఉన్నా విత్తనం దొరకడం లేదు.

పసుపు సాగు పెరుగుతోంది



సోమ శ్రీనివాస్, పసుపు రైతు, గోదూరు గ్రామం, జగిత్యాల్ల

ప్రస్తుత సీజన్‌లో పసుపు సాగు పెరగనుంది. పసుపునకు మార్కెట్‌లో అధిక ధరలు రావడం, పసు పు బోర్డు ఏర్పాటు తదితర అంశాలు పసుపు సాగు పెరగడానికి కారణంగా మారింది. పలువురు రైతులు పసుపు సాగు చేయడానికి మొగ్గు చూపుతు న్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు.

రెస్టారెంట్లు, టిఫిన్‌సెంటర్లపై మున్సిపల్ అధికారుల దాడులు

- రూ.18 వేల జరిమానా

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని పలురెస్టారెంట్లు, బేకరీ, టిఫిన్‌సెంటర్లు, హోటళ్లు, ప్లాస్టిక్ దుకాణాలపై శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. తినుబండారాలను, సింగిల్‌యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ.18,000జరిమానాలు విధించారు. ఈ సందర్భంగామున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ట్రేడ్‌లైసెన్స్ లేనివారు వెంటనే తీసుకోవాలని సూచించారు. తడి,పొడి, హానికరమైన చెత్తగా వేరుచేసి దుకాణాలకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని లేనిచో జరిమానాలను విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలేఅశోక్, రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌మహేష్, సిబ్బంది హేమంత్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగుట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదుచేశామని పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు తెలిపారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా


ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో తొలగించిన కాంట్రాక్టుకార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికులసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. టౌన్‌షిప్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో 100 మంది కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లుక శంకర్ మాట్లాడుతూ ఇటీవల టౌన్‌షిప్‌లోని వివిధ జోన్లకు సంబంధించి టెండర్లలో మ్యాన్ పవర్‌ను తగ్గించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో కార్మికులు అయోమయంలో పడ్డారన్నారు. కొత్త టెండర్లలో కార్మికులను తగ్గించి టెండర్లను పిలవడంతో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న కొంత మంది కార్మికులను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఇచ్చిన ఆదేశాల మేరకు 60 సంవత్సరాలు దాటిన కార్మికుల పిల్లలకు డిపెండెంటు ఎంప్లాయ్‌మెంట్ కింద పనులు కల్పించిందని, దీంతో చాలామంది కార్మికులు తమ వారసులను తమస్థానాల్లో ఉద్యోగాలు కల్పించారన్నారు. కొత్త టెండర్లలో డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ కింద చేరిన వారిని చేర్చలేదన్నారు. దీనివల్ల ఆకార్మికులను తొలగించేందుకు సదరు కాంట్రాక్టర్లు సిద్ధయయ్యారన్నారు. ఇప్పటికే కొంతమంది కార్మికులను విధుల నుంచి తొలగించారని తెలిపారు. కొత్త టెండర్లతోపాటు పాత టెండరులో ఉన్న అందరు కార్మికులను చేర్చి కార్మికులకు న్యాయం చేయాలని శంకర్ డిమాండ్ చేశారు. లేకుంటే సోమవారం నుంచి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తాము టౌన్‌షిప్‌లో విధులుబహిష్కరిస్తే ఎన్టీపీసీ యాజమాన్యమే బాధ్యత వహించాలని, తప్పని పరిస్థితుల్లో తాము విధులు బహిస్కరంచాల్సి వస్తున్నదన్నారు. 2022లో ఎన్టీపీసీ యాజమాన్యంతో జరిగిన ఒప్పందం ప్రకారం 1,020 రూపాయల అలవెన్సులను కార్మికులకు చెల్లించడం లేదని, 16 నెలల ఏరియర్స్‌ను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లోని నాలుగు జోన్లను క్లబ్ చేసి ఎ రాజేశం అనే కాంట్రాక్టరుకు పనులను అప్పగించారన్నారు. ఈ విషయంలో యాజమాన్యం స్పందించి చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, స్వామి, రవి, కృష్ణ, మొండయ్య, ఓదెలు, నర్సయ్య, రమేష్, శంకర్, చిరంజీవి, రాయమల్లమ్మ, సూరమ్మ, ఓదెమ్మ, హైమవతి, పద్మ, స్వరూప, సంధ్య, సరోజన, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగయ్య పల్లి మూల మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన శత్రువేదుల శ్రావణ్ తన సోదరుడు శశిధర్ కలిసి భూపాలపల్లి జిల్లా జంగ పల్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి-మంథని ప్రధాన రహదారి రంగయ్యపల్లి మూలమలుపు వద్ద ఉన్న టేకు చెట్లను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శ్రావణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. శశిధర్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108కి సమాచారం ఇవ్వగా గాయపడ్డ వారిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రయాణికురాలిపై కోతుల దాడి

ఓదెల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓప్రయాణికురాలిపై కోతులు దాడిచేయ డంతో తీవ్రగాయాలయ్యాయి. కొత్తగూడెంకు చెందిన బండి స్రవంతి రైల్వే స్టేషన్‌లోని కౌంటర్‌వద్దకు టికెట్ కోసం వెళుతున్న క్రమంలో కోతులు అకస్మాత్తుగా దాడిచేసి నోటకరిచాయి. దీంతో మహిళ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. పొత్కపల్లికి చెందిన బంధువు గూడెపు సంజీవరెడ్డి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో ఇక్కడి రైల్వేస్టేషన్ లో సంఘటన చోటుచేసుకుంది. గాయాలకు గురైన మహిళను జమ్మికుంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు


గాయపడ్డ రైతు కొమురయ్య

తంగళ్లపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికిచెందిన రైతు జీల కొమురయ్య(48) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు పోవడంతో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. త్వరగా ఫ్యూజువేసి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించి తనపొలానికి నీరు అందించాలని భావించి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో కొమురయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ రైతును భారతీయ కిసాన్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖకు సంబంధించిన హెల్పర్ స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆరోపించారు. హెల్పర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతు మరమ్మతులుచేసే క్రమంలో విద్యుత్ గురయ్యాడన్నారు. ఈసంఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

చేలలో భూసారం పెరుగుదలకు దోహదం..


చేనులో చెరువు మట్టి

చొప్పదండి, మే 9 (ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి పంట చేలకు ఎంతో మేలు చేస్తుంది. ఎర్రనేలలో చెరువు మట్టి పోస్తె చేనుకు పుష్టి చేకూరుతుంది. ఎండాకాలంలో నీరంతా ఇంకిపోయి చెరువు ఎండిపోగానె పూడికతీత పనులను ప్రారంభిస్తారు. ఆ మట్టిని రైతులు తమ పొలాల్లో పోసుకుంటున్నారు. రైతులు తమ పంట చేనులో చెరువుమట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. వర్షాలు పడినప్పు డు అనేక పోషకవిలువలు కలిగిన సారవంత మైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం గ్రామాల్లోని చెరువుల్లో పూడిక పనులు ప్రారంభంకానున్న నేపథ్యంలో చెరువు మట్టి ప్రాముఖ్యత వివరాలు..

చెరువు మట్టితో ప్రయోజనాలు..

- చెరువు మట్టితో రైతుల పంట దిగుబడి పెరుగుతుంది.
- చెరువు మట్టిని చేనులో పోయడం ద్వారా ఆమ్ల, క్షార గుణాలను తటస్థంగా మారతాయి.
- నేలలోని లవణాల ఘాడత తగ్గుతుంది.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే శక్తి నేలకు కలుగుతుంది.
- దిగుబడి పెరిగి రైతులకు అధిక ఆదాయం వస్తుంది. నేల సార వంతంగా మారుతుంది.
- చెరువులో పూడిక మట్టి తరలింపుతో వర్షాకాలంలో నీటినిల్వలు పెరుగుతాయి. తద్వారా గ్రామంలో భూగర్భ నీటిమట్టం పెరుగుతుంది.

లారీ డ్రైవర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కరీంనగర్ క్రైం, మే 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. లారీని వేగంగా నడుపుతూ నో ఎంట్రీ ప్రాంతంలోకి ప్రవేశించడాన్ని గుర్తించిన పోలీసులు బ్రీత్‌ఎనలైజర్‌తో డ్రైవర్‌ను పరీక్షించారు. మోతాదుకు మించి అత్యధికంగా 100 ఎంఎల్ రక్తంలో 550 మిల్లీ గ్రాముల ఆల్కాహాల్ ఉన్నట్లు వెల్లడైంది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు, లారీని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో సీఐ పర్శ రమేష్, ఎస్సై ఇషాక్ అమ్మద్ పాల్గొన్నారు.

రూ.7410 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7410 పలికింది. నలుగురు రైతులు 36క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7410, కనిష్ఠ ధర రూ.6950 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఏసీబీ వలకు చిక్కిన అవినీతి అధికారి

- రూ.60వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి


ఏసీబీకి పట్టుబడిన ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలో అవినీతి అధికారిని కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ పోలీసు అధికారులు వలవేసి పట్టుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న ఎర్రంరెడ్డి అమరేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.60వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పోలీసులకు పట్టుబడ్డాడు. నీటిపారుదల శాఖలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని డివిజన్-7 ఆవునూర్, అగ్రహారం గ్రామాల్లో చెక్‌డ్యాం నిర్మాణంకు సంబంధించిన రూ.50లక్షల బిల్లు ఎంబీరికార్డు చేసేందుకు కాంట్రాక్టర్‌ను ఈఈ ఎర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డి కొద్దిరోజులుగా లంచం డబ్బుల కోసం వేధిస్తున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ పోలీసులను ఆశ్రయించాడు. రూ.50లక్షల బిల్లుమంజూరు కోసం లక్ష రూపాయలు డిమాండ్ చేయగా చివరకు 75వేల రూపాయలకు ఒప్పందం కుదిరింది. లంచం డబ్బులు ఇంటివద్ద ఇవ్వాలని చెప్పగా ఏసీబీ పోలీసుల సూచన మేరకు రాత్రి 8గంటల ప్రాంతంలో లంచం డబ్బులు రూ.60వేలు కరీంనగర్ విద్యారణ్యపురిలో ఈఈ అమరేందర్ రెడ్డి ఇంటివద్ద కాంట్రాక్టర్ ఇస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ వీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు మాటువేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే చెక్‌డ్యాంకు సంబంధించిన రూ.5కోట్ల రూపాయల బిల్లురికార్డు చేసేందుకు ఈఈ ఇంతకుముందు4లక్షల రూపాయలు బాధితుడి నుంచి తీసుకున్నాడని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లంచంకు సంబంధించిన రూ.60 వేల నగదును సీజ్‌చేశారు. నిందితుడు ఈఈ అమరేందర్‌రెడ్డిని అరెస్టుచేసిన ఏసీబీ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. శనివారం కరీంనగర్ ఏసీబీకోర్టులో అతడిని హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

లంబడితండా(బి)లో ఎక్సైజ్ దాడులు


పట్టుకున్న గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

ధర్మారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడితండా(బి) గ్రామంలో ఎక్సైజ్ శాఖ-డిస్ట్రిక్‌టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 18 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా, ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ పావనితోపాటు పదిమంది సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైన నాటుసారా, గుడుంబా తయారుచేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ పావని హెచ్చరించారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మైనార్టీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపే సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ గురుకుల ఆర్‌ఎల్‌సీ కనపర్తి సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం అస్లాం మసీద్ దగ్గర ఇరుకుల్ల మైనార్టీగురుకుల పాఠశాలలో కల్పిస్తున్నసౌకర్యాలపై ఉపాధ్యాయ బృందంతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అల్పసంఖ్యాకులు అందరితో సమానంగా ఎదగడానికి గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కో-ఆర్డినేటర్ మహేందర్, కాలేజ్ కో-ఆర్డినేటర్ రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగల బీభత్సం

- రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ

ఎల్లారెడ్డిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలో తాళం వేసి ఉన్న వొద్దిరాల శ్రీనివాస్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. బీరువా, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. ఇంటిలో దాచుకున్న రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకొనిపోయారు. శ్రీనివాస్, తన భార్య ఇద్దరు బస్టాండు ప్రాంతంలో కర్రీ పాయింట్‌తో పాటు చపాతీలు తయారుచేస్తూ జీవిస్తున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి దుకాణానికి చేరుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పట్టపగలే చోరీకి పాల్పడడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎన్టీపీసీ ప్లాంటులో విపత్తు జరిగితే ఎదుర్కొంటాం

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా



మాక్ డ్రిల్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంటులో ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతీ క్షణం అధికార యంత్రాంగం, సిబ్బంది సన్నద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు శుక్రవారం సాయంత్రం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో భద్రతా సిబ్బందితో సీపీ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని దుస్సంఘటన జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండడంలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు సీపీ పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం, అగ్ని ప్రమాదాలు జరినప్పుడు భద్రతా దళాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను మాక్‌డ్రిల్ ద్వారా వివరించామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాను

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న క్రమంలో ఏదైనా విపత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, ప్రాజెక్టు పరిసరాల్లో, పని స్థలాల్లో తనిఖీలు తదితర అంశాలను మాక్ డ్రిల్‌లో ప్రదర్శించారు. సీఐఎస్ఎఫ్ రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ అంజనేయరాజు, డిప్యూటీ కమాండెంట్ ఓవికె శాస్త్రి పర్యవేక్షణలో జరిగిన మాక్ డ్రిల్‌లో అసిస్టెంట్ కమాండెంట్లు జై కన్వర్, అకేశ్వర్‌సింగ్, ఇన్‌స్పెక్టర్లు, జవానులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ

- చారిత్రక, పురాణాల ప్రాశస్త్యానికి ఇబ్బంది లేకుండా అభివృద్ధి
- మొదటి విడత రూ.76.73 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- భీమన్న ఆలయంలోనే భక్తులకు దైవ దర్శనాలు
- ప్రధాన గర్భాలయం ముట్టకుండా అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నిధులు మంజూరు

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ పట్టనుంది. స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రాజన్న ఆలయ అభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశ పనులను జూన్ మాసం నుంచి ప్రారంభించేందుకు నిర్ణయించారు. జూన్15వ తేదీ నుంచి రాజన్న ప్రధాన దేవాలయంలోకి భక్తులను అనుమతించరు. నిత్యపూజలను మాత్రం అర్చకులు ప్రధాన దేవాలయ గర్భాలయంలో నిర్వహిస్తారు.

భక్తులకు దైవ దర్శనాన్ని స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శించుకు నేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శృంగేరి పీఠాధిపతి సూచించిన మార్పులను పరిగణలోకి తీసుకుని చారిత్రక, పురాణాల నేపథ్యం ఉన్న భాగాలను, పురాతన గ్రంథాలు, పూర్వం రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధిని విస్తరించేందుకు ముందుకు సాగుతున్నారు. పురాణ నేపథ్యం కలిగిన ధర్మగుండం, గుడి చెరువు ప్రాశస్త్యం తగ్గకుండా 40ఎకరాల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అన్నదాన సత్రం, క్యూ కాంప్లెక్స్‌లు, వసతిగృహాలు, రెండు ప్రాకారాలు, కార్యాలయం, కోనేరు, కల్యాణకట్ట, కోడె మొక్కుల ప్రాంతం వంటి వాటిని కొత్తగా నిర్మించనున్నారు. ఇందకు మూడు దశల్లో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.550 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆలయ విస్తరణకు రూ.76 కోట్లు, కల్యాణ మండపానికి రూ.33 కోట్లు, రోడ్ల విస్తరణ పనులకు రూ.47.86 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇటీవల బడ్జెట్‌లో మరో రూ.100కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది.

1979లో ఆలయ పునరుద్ధరణ..

వేములవాడ రాజన్న ఆలయ పునరుద్ధరణ 1979లో చేపట్టారు. ఆలయ సంప్రదాయ నిర్మాణ ఆధారంగా అప్పట్లో గర్భగుడి ద్వారాలు, రాజగోపురాలను ఆధునిక శైలిలో మరమ్మతులు చేసి ఆధునికీకరించారు. ధర్మగుండం, ఆలయ ప్రాంగణంలో ఉన్న పరివార దేవాలయాలు, కోటిలింగాలను ప్రత్యేక ఆకర్షణగా నిర్మించారు. కాగా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రస్తుతం ఆలయ అభివృద్ధి ఉండనుంది. పురాతన శిల్పకళ, శైవ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయాన్ని విస్తరించనున్నారు. రాజన్న ఆలయాన్ని సౌందర్యానికి ప్రతిరూపంగా రూపుదిద్దేలా ప్రణాళికలు చేస్తున్నారు. ధర్మగుండం మధ్యలో శివుడి విగ్రహం, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడం కోసం ధర్మగుండం చుట్టూ పార్క్, నడక మార్గాలతో పాటు ఆకట్టుకునే డిజైన్‌లను తయారు చేస్తున్నారు.





వేములవాడ రాజన్న ప్రధాన ఆలయ ఊహాచిత్రం

శృంగేరి శంకరమఠం పీఠాధిపతి సూచనలతోనే..

చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఉన్న భాగాలను, పురాణాలు, పురాతన గ్రంథాల, 1970లో వెలుగుచూసిన రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఆలయ అభివృద్ధిని చేసేందుకు నిర్ణయించారు. ఆలయ విస్తరణ పనుల్లో వేములవాడ చాళుక్యుల శైలి మూర్తీ భవించేలా నిర్మాణం జరగనుంది.

తెలంగాణలో ఎంతో గొప్పగా నిర్వహించే బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజులు జరుపుకుంటే వేములవాడలో మాత్రం 7 రోజులు నిర్వహిస్తారు. బతుకమ్మ పుష్పం నుంచే ఆలయం ఉద్భవించిందన్న పౌరాణికగాథ అనుగుణంగా బతుకమ్మ గుర్తులు ప్రతిబింబించేలా నిర్మాణం చేపట్టనున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో గతంలో ఆలయ పునరుద్ధరణ వంకరగా జరిగిందని, ప్రస్తుత విస్తరణ పనుల్లో రెండు ప్రాకా రాలు, రెండు వీధులతో క్రమ పద్ధతిలోకి మార్చనున్నారు. నాలుగు ఎకరాల్లో ఉన్న ఆలయాన్ని 4.6 ఎకరాలకు పెంచనున్నారు.



భీమేశ్వర స్వామి ఆలయం

చరిత్రలో నిలిచేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం..

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దక్షిణభారత దేశంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా వేములవాడ రాజన్న ఆలయం కొనసాగుతోంది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలనేది నా చిరకాల వాంఛ. దాని కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాను. నేను ఎమ్మెల్యేగా ఉండగా ఆలయ అభివృద్ధి జరగడం ఎంతో సంతోషంగా ఉంది. వచ్చే వెయ్యి ఏళ్ల గుర్తుండేలా ఆలయ విస్తరణ చేయాలని అనుకుంటున్నాము. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డితోపాటుగా ఎనిమిది మంది మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమాలను చేసుకున్నాము. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో దైవ దైర్శనం కల్పిస్తాము. ఎంతో చారిత్రక, పురాణ నేపథ్యం కలిగి ఉన్న విభాగాలను ముట్టకుండా శృంగేరి శంకరమఠం పీఠాధిపతుల సూచనలు, సలహాల మేరకే ఆలయ విస్తరణ పనులను చేపడుతున్నాము.



గుడి చెరువు అభివృద్ధి ఊహాచిత్రాలు

పవర్ లిఫ్టింగ్‌లో సిరిచందనకు కాంస్యం



సాధించిన పతకం ప్రశంస పత్రంతో సిరిచందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన తుడి సిరిచందన కాంస్య పతకం సాధించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించిన ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గంగాధర మండలం మర్రిగడ్డకు చెందిన సిరిచందన 52 కేజీల విభాగంలో 330 కిలోల బరువును ఎత్తి కాంస్యం సాధించింది. గత డిసెంబరు 16 నుంచి 19 వరకు ఢిల్లీ సర్దార్ సింగ్ స్టేడియంలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ ఇండియా ఫెడరేషన్ కప్ జాతీయ చాంపియన్‌షిప్‌లో 330 కిలోల బరువు ఎత్తి రజతం సాధించింది. దీంతో ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భారత జట్టు తరఫున ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్, ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, పవర్ లిఫ్టింగ్ కోచ్ భీమనాతిని మల్లేశం అభినందించారు.



ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల వేదికపై సిరిచందన

మానసాదేవి ఆలయంలో కొనసాగుతున్న వార్షికోత్సవం

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న సప్తమ వార్షిక వేడుకలు రెండోరోజు శుక్ర వారం కొనసాగాయి. ఈ వేడుకల్లో ఉదయం చండీ హోమం, 108మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, మానసాదేవికి లక్ష పుష్పార్చన, మహేశ్వరునికి భస్మాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించి అన్నదానం నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్‌రెడ్డి, పులి కృష్ణ, అలువాల కోటి, బద్దం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.



మానసాదేవి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- వాకింగ్‌తో పలు ప్రయోజనాలు
- నేడు వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే

నడకతో ఆరోగ్యం





కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జీవన విధానంలో ప్రజలకు తగిన వ్యాయామం లేక శరీరంపై నియంత్రణ లేకుండాపోతోంది. ప్రజలు బీపీ, షుగర్, స్థూల కాయంతో పడుతున్నారు. ప్రతి రోజు కనీసం 45 నిమిషాలు నడవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. నడకను తమ జీవితంలో భాగంగా చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం మైదానాలు, ఖాళీ స్థలాలు, రహదారుల వెంట చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా వాకింగ్ చేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

● **ఉపయోగాలు:** నడక మన శరీర నిర్మాణాన్ని మార్చుతుంది. నడకతో చాలా రకాల ఉపయోగాలున్నాయి. గుండెజబ్బులు, మధుమేహం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, స్థూలకాయం రాకుండా చూస్తుంది. శరీరంలోని కొవ్వును తగ్గించి జీవిత కాలాన్ని పెంచుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా యువత, పెద్దలు నడకను జీవితంలో ఒక భాగంగా చేసుకుంటున్నారు. ప్రత్యేకించి ఇటీవలి కాలంలో 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారు, వృద్ధులు ఆసక్తి చూపుతున్నారు.

● **నేపథ్యం:** నడక ప్రాధాన్యాన్ని గుర్తిం చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2002 మే 10న నిర్వహించిన సమావేశంలో వ్యాయామం, ఆరోగ్యం, ఆహారం అంశాల మీద చర్చించింది. ఆహార నియమాలతో పాటు నడక వ్యాయామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మే 10న వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే జరుపుకోవాలని సూచించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మే10న నడక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

వాకింగ్ ప్రారంభం ఇలా...

- వాకింగ్ ప్రారంభించే వారు మొదటి రోజు 5 నుంచి 15 నిమిషాలు నడిచి క్రమేపి సమయాన్ని పెంచాలి.
- షూస్ తప్పని సరిగా ధరించాలి.



- వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మంచిది.
- రహదారులపై వాకింగ్ చేయడం కంటే మైదానాలలోనే వాకింగ్ చేయడం మంచిది.

వాకింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నడిచేటప్పుడు చేతులు ఊపుతూ శరీరాన్ని నిటారుగా ఉంచాలి.
- వాకింగ్ ఆపే ముందు వేగాన్ని క్రమేపి తగ్గించాలి.
- నడిచేటప్పుడు వదులుగా ఉండే దుస్తులనే ధరించాలి.
- ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్ సలహాతో వాకింగ్ చేయాలి.
- ప్రతి రోజు 45 నిమిషాలు నడిస్తే మంచింది.
- పక్కవారితో సాధ్యమైనంత వరకు మాట్లాడకుండా ఉండాలి.
- నడిచేట ప్పుడు శ్వాసపై నియంత్రణ అవసరం.

నూతనోత్సాహం కలుగుతుంది..: ఎడ్ల మధు, వాకర్



వాకింగ్‌తో చేస్తే ఉత్సాహంగా ఉంటుంది. నడవని రోజు అసౌకర్యంగా ఉంటుంది. ఉదయమే ఏకాగ్రతతో నడవటం వల్ల ఇతర ఆలోచనలు దరి చేరవు. 10 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా మైదానంలో వాకింగ్ చేస్తున్నాను.

బీపీ, షుగర్ నార్మల్‌గా ఉంటాయి.. :ఎంఏ కరీం, వాకర్



ఎనిమిదేళ్లుగా ప్రతి రోజు వాకింగ్ చేస్తున్నాను. గతంలో కాళ్లు, కీళ్లనొప్పులుండేవి. ప్రస్తుతం అవేమి లేవు. అనారోగ్య ఇబ్బందులు లేవు. షుగర్, బీపీ నార్మల్‌గా ఉన్నాయి.

ధర్మపురిలో వైభవంగా అన్నకూటోత్సవం

ధర్మపురి, మే 9 (ఆంధ్రజ్యోతి): నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్తహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠాపైకి తీసుక వచ్చి ఆసీనులు చేశారు. అనంతరం పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు



నివేదన కోసం తీసుకు వెళుతున్న అర్చకులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

పెద్దపల్లి

ఇన్‌చార్జి ఎంపీవోగా శరత్‌బాబు

పెద్దపల్లి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఫయాజ్ హజ్ యాత్రకు వెళ్లిన దృష్ట్యా నిట్టూరు పంచాయతీ కార్యదర్శి శరత్‌బాబుకు ఇన్‌చార్జి ఎంపీవోగా అధికారులు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీవోగా శరత్‌బాబు జూన్ 30 వరకు ఎంపీవోగా విధులు నిర్వర్తించనున్నారు.

డ్రగ్స్‌పై అవగాహన

పెద్దపల్లి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రాంపల్లిలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు డ్రగ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాముక్త భారత్ కమ్యూనిటి ఎడ్యూకేటర్ శ్యామల మాట్లాడుతూ ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఇంట్లో పిల్లలు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. డ్రగ్స్ అలవాటుపడి యువత పెడదారి పడుతున్నారన్నారు. చాక్లెట్లు, లిక్విడ్, పౌడర్ల రూపంలో మన పల్లెలకు చేరిందని డ్రగ్స్ అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబర్ 14446కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌తో పాటు 150 మంది ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి ఇన్‌చార్జిలకే రేషన్ షాపులు

- రామగుండం అర్బన్‌లోనే 18షాపులకు ఇన్‌చార్జి డీలర్లు - కార్డుల రేషనలైజేషన్‌కు తూట్లు - కొత్త డీలర్‌షిప్‌లు ఇవ్వకుండా లాబీయింగ్

కోల్‌సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు 40శాతం రేషన్‌కార్డులు ఉన్న రామగుండం అర్బన్‌లో ఏళ్ల తరబడి రేషన్ షాపులకు ఇన్‌చార్జిల వ్యవస్థనే కొనసాగుతోంది. కొంత మంది డీలర్ల లాబీయింగ్‌తో ఇక్కడ కార్డుల కేటాయింపులో రేషనలైజేషన్ కాకుండా అడ్డుకుంటున్నారు. రామగుండం అర్బన్ పూర్తిగా నగరపాలక సంస్థ పరిధిలో ఉంటుంది. 75వేలకుపైగా ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ప్రతీ నెల సరాసరి 750 టన్నుల బియ్యం రేషన్‌షాపుల ద్వారా సరఫరా అవుతోంది. అర్బన్‌లో 74రేషన్‌షాపులు ఉన్నాయి. రామగుండం, ఎన్టీపీసీ, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతాల్లోని 50 మున్సిపల్ డివిజన్లలో ఈ షాపులు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, మున్సిపల్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మిక కుటుంబాలే 12వేల వరకు ఉంటాయి. రోజు వారీ కూలీలు, శివారు గ్రామాల్లోని వ్యవసాయ కూలీల కుటుంబాలు ఉన్నాయి. వీరికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున రేషన్ అందించాల్సి ఉంది. ప్రభుత్వం ఆహార భద్రత కార్డుల రేషనలైజేషన్ కోసం గతంలో జీఓఆర్‌టీ నంబర్ 55ను జారీ చేసింది. దీన్ని అనుసరించి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒక్కొక్క షాపునకు 800 నుంచి 1000కార్డులు ఉండాల్సి ఉంటుంది. కార్పొరేషన్ పరిధిలో 74రేషన్ షాపులకు సరాసరి



1000వరకు కార్డులు ఉండే అవకాశం ఉంది. కానీ రామగుండంలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కొన్ని రేషన్‌షాపులకు 1200 నుంచి 1500 కార్డులు ఉండగా, కొన్ని రేషన్ షాపులకు 600 నుంచి 700 కార్డులు మాత్రమే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో జనావాసాలకు, రేషన్ షాపులకు మధ్య దూరం కూడా ఎక్కువగా ఉంటుంది.

● జిల్లా ఉన్నతాధికారులపైనే ఆరోపణలు

కార్పొరేషన్ పరిధిలో 74రేషన్ షాపులు ఉంటే 14రేషన్ షాపులకు ఇన్‌చార్జి డీలర్లతోనే రేషన్ సరఫరా జరుగుతోంది. డీలర్లు మరణించడం, అవకతవకలతో కేసులు నమోదు వంటి సందర్భాల్లో ఆ డీలర్‌షిప్‌ను సస్పెండ్ చేసి మరో డీలర్‌కు షాపును అటాచ్ చేశారు. ఇది కూడా ఒకటి రెండు నెలలు మాత్రమే అవకాశం ఉంటుంది. కానీ రామగుండంలో ఏళ్ల తరబడి ఇన్‌చార్జి డీలర్‌షిప్‌లే కొనసాగుతున్నాయి. ఒక్కో డీలర్‌కు రెండు మూడు షాపులు ఇన్‌చార్జి ఇచ్చారు. దీంతో ఇటు రేషన్ తీసుకుంటున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు షాపులు తీస్తారో, ఎప్పుడు మూసివేస్తారో తెలియని పరిస్థితి ఉంది. దీన్ని అడ్డుపెట్టుకుని కొందరు డీలర్లు లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌చార్జిల పాలన బదులు కొత్త డీలర్‌షిప్‌లు అవకాశం ఇస్తే కొందరు నిరుద్యోగులకు కూడా ఉపాధి కలిగే అవకాశం ఉంది. దీనిపై డీలర్ల లాబీయింగ్ కొత్త డీలర్‌షిప్‌లు కాకుండా అడ్డుకుంటున్నట్టు తెలుస్తోంది. రామగుండం అర్బన్‌లో రేషనలైజేషన్ నిర్వహించకపోవడం, కొత్త డీలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో ఏకంగా కొందరు జిల్లా ఉన్నతాధికారులపైనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కొందరు నిరుద్యోగులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కలిసి ఇన్‌చార్జి డీలర్‌షిప్‌లు ఉన్న చోట కొత్త వారికి అవకాశం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రాలు ఇచ్చారు. కలెక్టర్ ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఈ ప్రాంత నిరుద్యోగులు కోరుతున్నారు.

జీపీవోల నియామకానికి కసరత్తు

(5వ పేజీ తరువాయి)

విక్రయించుకునే అవకాశం కల్పించారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో ఆన్‌లైన్‌లో ఒకరికి బదులు మరొకరి పేరు వచ్చినప్పుడు, సదరు వ్యక్తి భూమిని విక్రయించి రిజిస్ట్రేషన్ ఈజీగా చేసుకునే వీలు కల్పించారు. ఈ భూమి తనది కాదని, రికార్డుల్లో పేరు తప్పుగా పడిందని, మోఖా మీద మేమే ఉన్నామని రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని తహసీల్దార్‌కు విన్నవించినా కూడా నిలిపివేసే అవకాశం లేకుండా పోయింది. ధరణి పోర్టల్‌కు భద్రత లేదు. తప్పొప్పుల సవరణ కోసంకలెక్టర్, తహసీల్దార్ల చుట్టూ తిరుగుతున్నా నేటికి కూడా పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ కోర్టులను ఎత్తివేయడంతో పాటు వీఆర్‌వో, వీఆర్ఏ వ్యవస్థలను కూడా అప్పటి ప్రభుత్వం ఎత్తి వేసింది. ధరణి పోర్టల్ 2020 అక్టోబరు నెల నుంచి అందుబాటులోకి వచ్చింది. వీఆర్‌వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిన తర్వాత వారిని ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసేందుకు రెండు, మూడేళ్లు పట్టింది. వీఆర్‌వోలను సర్దుబాటు చేసే వరకు వారంతా ప్రతీ రోజు తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చి హాజరు వేసుకుని వెళ్లారు. 2022లో జిల్లాలో 117 మంది వీఆర్‌వోలను వారి విద్యార్హతలను బట్టి మున్సిపల్, నీటి పారుదల శాఖ, తదితర శాఖల్లో సర్దుబాటు చేశారు. అలాగే 2023 ఆగస్టులో 407 మంది వీఆర్ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. వారి విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌లుగా పోస్టింగులు ఇచ్చారు. రెవెన్యూ శాఖలో పది, పదిహేను సంవత్సరాలు పనిచేసిన వీఆర్‌వోలు, వీఆర్ఏల సర్వీస్ అంతా జీరో అయ్యింది. పదోన్నతులకు కూడా నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- పారిశుధ్య మెరుగు కోసం యాక్షన్ ప్లాన్ అమలు చేయండి - కార్పొరేషన్ సమీక్షలో ప్రత్యేకాధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, కమిషనర్ అరుణశ్రీ, అధికారులు

కోల్‌సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో వివిధ పథకాల క్రింద చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఆయన విస్తృత పర్యటన జరిపారు. రామగుండం పట్టణంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించి అదనంగా అవసరమైన 30లక్షల రూపాయలను మంజూరు చేశారు. సింగరేణి స్టేడియం వద్ద సీఈఆర్ క్లబ్‌లో జరుగుతున్న అగ్నివీర్ యువశక్తి శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 126 మందికి నాణ్యమైన భోజనం, శిక్షణ అందేలా చూడాలన్నారు. అనంతరం వివిధ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. డిగ్రీ కళాశాల సమీపంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న డ్రైన్ పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభంలోగా డ్రైన్ల పనులు పూర్తి కావాలని ఆదేశించారు. వీకే రామయ్య కాలనీలో నిర్మించిన రోడ్లను పరిశీలించారు.

అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. స్కీముల కాంట్రాక్టర్ల వారీగా పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పరిశీలించాలన్నారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. పారిశుధ్య విభాగం సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి డివిజన్ల వారీగా రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను కలెక్టర్‌కు వివరించారు. దీనిని వెంటనే అమలు చేయాలని, పని చేసే సిబ్బందిని ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ విభాగం పనితీరు మెరుగుపడిందని, ఇదే విధానాన్ని కొనసాగించి కార్పొరేషన్ ఆదాయం పెంచాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, డీఈ జమీల్, ఆర్‌వో ఆంజనేయులు, ఆర్ఐలు శంకర్‌రావు, ఖాజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బడిబాట

మంథని, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం పట్టణంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం సుమలత ఆధ్వర్యంలో పాఠశాల లోని ఉపాధ్యాయుల బృందం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ఉపయోగం, కల్పించిన వసతులు, బోధనా తీరు, ఫలితా లు లాంటి అంశాలపై తల్లిదండ్రులకు వివరించి తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోచయ్య, పీడీ కొమురోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

రామగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-2 ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పాల కృష్ణమూర్తి తండ్రి నర్సయ్య వర్ధంతి సందర్భంగా మండలంలోని కల్వచర్ల గ్రామంలో సింగరేణి యువబలగం ఆధ్వర్యంలో నిరుపేద మహిళకు శుక్రవారం నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో మేకల మారుతి, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, మాజీ వార్డు సభ్యుడు కుమారస్వామి, భూర్గు రాజు గౌడ్ కొంతం బాపు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డీఎంకు వినతి

మంథని, మే 9 (ఆంధ్రజ్యోతి): మంథని ఆర్టీసి డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఎంకు వినతిపత్రం ఇచ్చినట్లు ఎస్‌డబ్ల్యూఎస్ డిపో కమిటీ అధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి రాజయ్యలు శుక్రవారం తెలిపారు. కండక్టర్లకు నాణ్యమైన టిమ్ మిషన్లు ఇవ్వాలని, అన్ని రకాల స్పేర్ స్పాట్స్ తెప్పించాలని, బస్సులు కండీషన్స్‌లో ఉంచాలని, బస్టాండ్‌లో కార్మికులకు లంచ్ రూం ఏర్పాటు చేయాలని, టీమ్ రిజర్వేషన్లలో పొరపాట్లను నివారించాలని, నైట్ అవుట్ బస్సులకు డోర్లు ఫ్రీగా వేసుకునే విధంగా ఉండాలని, బస్సులకు టాప్ లైట్లు సరిగా ఉండే విధంగా చూడాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంథని, మే 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ గిరిజన బాలిక జూనియర్ కళాశాలలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్స్‌లో మొదటి సంవత్సరానికి గిరిజన, గిజనేతర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. ఈనెల 16న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల తమ 10వ తరగతి పాస్, ఇతర ఒరిజనల్ సర్టిఫికెట్ల తోపాటు ఒక జిరాక్స్ సెట్ తీసుకోనిరావాలన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నెం. 8333925362 కాల్ చేయాలని సూచించారు.

నర్సుల సేవలు మరువలేనివి



రక్తదానం చేస్తున్న ఆర్ఎంవో రాజు

కళ్యాణ్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్యం అందించడంలో నర్సుల సేవలు మరువలేనివని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ ఆఫీసర్ దినోత్సవం పురస్కరించుకుని ఆసుపత్రిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులను కంటికి రెప్పలా కాపాడుతూ వారి జబ్బులు నయం అయ్యే వరకు నర్సులే బాధ్యత తీసుకుంటారని, కరోనా సమయంలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా మహమ్మారి నుంచి ఎంతో మందిని కాపాడారన్నారు. నర్సింగ్ సిబ్బంది రాత్రి పగలు పని చేస్తూ తమ వృత్తినే దైవంగా భావిస్తారన్నారు. ఆర్ఎంవో రాజు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సౌందర్య, మారిడీలీన, మల్లీశ్వరి, సుమలత, రాజు, పావని, సరిత, సునీతరాణి, ప్రశాంతి, సురేఖ, పీఆర్ఓలు అన్వర్, కృష్ణ, తాజ్, మహేష్, రాజేష్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె విరమణ

పెద్దపల్లిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికులు వారం రోజులుగా చేస్తున్న సమ్మె శుక్రవారం విరమించారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో రైల్వే అధికారులతో జరిగిన చర్చలు సఫలం అయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. కుటుంబ పోషణ భారంగా మారడంతో వారం రోజులుగా విధులు బహిష్కరించి, సమ్మెకు దిగినట్లు తెలిపారు. రైల్వే అధికారులు సౌత్ సెంట్రల్ జోనల్ అసిస్టెంట్ కమిషనర్ పాల్వాయి రవీ, కృష్ణమోహన్, రామగుండం కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ తదితరులతో చర్చలు జరిపామని వివరించారు. దీంతో రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించారని, మిగతా రెండు నెలలది మే 12న చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. కనీస వేతనం నెలకు 12 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఆరు వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. పీఎఫ్, ఈఎస్ఐ కోత విధిస్తూ ఎక్కడ జమ చేస్తున్నారో కార్మికులకు సమాచారం లేదన్నారు. పనిముట్లు, కార్మికుల రక్షణ పరికరాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్ తీవ్రమైన నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని, ఈ సమస్యలన్నింటిపై రైల్వే అధికారులు వెంటనే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సిపెల్లి రవీందర్, లక్ష్మి, రాజలింగం, అమృత, అరుణ, మల్లయ్య, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-5ని తనిఖీ చేసిన డైరెక్టర్(ఆపరేషన్స్)



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఎన్‌వి సూర్యనారాయణ

గోదావరిఖని, మే 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే ఓసీపీ-5 బొగ్గుగనిని శుక్రవారం డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీ సూర్యనారాయణ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. క్వారీలో కోల్‌బెంచ్‌లను, ఓవర్ బర్డ్ పని స్థలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని చేయాలని, వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో కోల్ తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, త్వరితగతిన ఓబీని వెలికి తీయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్, మేనేజర్ రమేష్‌బాబు, ఇంజనీర్లు అనిల్ గబాలే, రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడుకోవడానికే సమ్మె

పెద్దపల్లిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) కార్మికుల హక్కులను కాపాడేందుకే ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య తెలిపారు. పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు అవలంబిస్తోందని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని నిరసిస్తూ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కార్మికులందరు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యం రావు, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్, సిపెల్లి రవీందర్, నాయకులు జిల్లాల ప్రశాంత్, మొదుంపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్, సందీప్, సూరజ్, తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా ఆలయాల్లో పూజలు





ఐని కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ నాయకులు, ఓదెల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఓదెల , మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పై పోరాడుతున్న భారత త్రివిధ దళాలకు మద్దతుగా శుక్రవారం మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఈవో సదయ్యతోపాటు అర్చకులు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆదేశం మేరకు పూజలు నిర్వహించినట్లు ఈవో తెలిపారు. శత్రుదేశంపై పోరాడుతున్న సైనిక సమరానికి విజయం చేకూరాలని భవంతుడిని ప్రార్థించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈవో సదయ్య, అర్చకులు ధూపం మఠం వీరభద్రయ్య, పంచాక్షరి, భవాని, భక్తులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): భారత సైనికులకు బాసటగా ఆపరేషన్ సిందూర్ విజయవంతం కోసం శుక్రవారం గోదావరిఖనిలోని కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గట్ల రమేష్ మాట్లాడుతూ మూడు రోజులుగా వీరోచితంగా పోరాడుతున్న దేశ సైనికులకు ఆ దేవుడు వారికి శక్తి యుక్తులు ప్రసాదించాలని కోరారు. ఉగ్రవాదాన్ని అంతమొందించి ప్రపంచపటంలో పాకిస్తాన్ ఉగ్రవాదం తుడిచిపెట్టేవిధంగా ఈ ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదం ఊసే లేకుండా మత విభేదాలు లేని భారత్ నిర్మాణానికి ఈ ఆపరేషన్ సిందూర్ నాంది కావాలని కోరుకున్నారు. యుద్ధానికి ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయాలకైనా పౌరులుగా అందరం సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు.

కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, అర్చకులు, కాంగ్రెస్ నాయకులు కాల్వలింగస్వామి, ఎం.రవికుమార్, ముస్తఫా, పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, ఉల్లెంగుల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు ప్రవీణ్, దశరథం, సత్యనారాయణ, స్వరాజ్ రామస్వామి, బుర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో సెలవులు రద్దు

గోదావరిఖని, మే 9(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సెలవులను రద్దు చేస్తూ శుక్రవారం డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో కొనసాగుతున్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా పౌర రక్షణ కోసం పని ప్రదేశాల్లో అధికారులు ఉండే విధంగా సీఎండీ ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రతి అధికారి పని స్థలాల్లో అందుబాటులో ఉండేలా చూడాలని, సెలవులను రద్దుచేస్తూ, సెలవుల్లో ఉన్న అధికారులు విధుల్లో చేరాలని సూచించారు.

'లైఫ్ సర్టిఫికెట్ల జాప్యంతో ఆగిన పింఛన్లు'

గోదావరిఖని, మే 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పదవీవిరమణ పొందిన కార్మికులకు సంబంధించిన కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వడంలో జాప్యమవడంతో సుమారు 1,818 మందికి పెన్షన్లు నిలిచిపోయాయని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలో పనిచేసి దిగిపోయిన కార్మికులు లైఫ్ సర్టిఫికెట్‌లు ఇవ్వకపోవడంతో పెన్షన్‌దారులకు పెన్షన్ నిలిచిపోయిందని, సీఎంపిఎఫ్ అధికారులు సంబంధించిన పెన్షన్‌దారులకు లైఫ్ సర్టిఫికెట్ లు పొందే విధంగా తగిన ప్రకటన చేసి పెన్షన్‌ను తీసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ వారు గత సంవత్సరం మార్చి 8వ తేది నుంచి కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారని తెలిపారు. సమాచార హక్కు చట్టం-2005 అనుసరించి గోదావరిఖని కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ రీజినల్ కమిషనర్, కొత్తగూడెం రీజినల్ కమిషనర్‌లకు లేఖలు రాయడం జరిగిందని పేర్కొన్నారు. అందుకు కొత్తగూడెం సీఎంపీఎఫ్ ప్రచా సమాచార అధికారి పంపిన లేఖలో కొత్తగూడెం సీఎంపీఎఫ్ రీజియన్ పరిధిలో 2134 మందికి కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారని, కొత్తగూడెం సీఎంపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నుంచి 18,111 మంది పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. ప్రతి నెల పెన్షన్ దారులకు రూ.20,06,15726 చెల్లిస్తున్నారని, 1818 మంది పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో వారి పెన్షన్ నిలిచిపోయిందని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించని 1818 మంది పెన్షన్ దారులు ఆన్‌లైన్‌లో జీవన్ ప్రమాణ్ పత్రాన్ని సీఎంపీఎఫ్ అధికారులకు సమర్పించి పెన్షన్ పొందాలని కోరారు.

మహిళా రెస్క్యూ సిబ్బంది ఎంపిక పరీక్ష



రెస్క్యూ శిక్షణకు ఎంపికైన మహిళా ఉద్యోగినిలు

గోదావరిఖని, మే 9 (ఆంధ్రజ్యోతి): రెస్క్యూ శిక్షణకు అర్హత గల్గిన మహిళా ఉద్యోగుల ఎంపిక కోసం శుక్రవారం స్థానిక రెస్క్యూ స్టేషన్‌లో అధికారులు పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినిల్లో గ్రాడ్యుయేట్లు, ఎలక్ట్రీషియన్లు, జనరల్ మజ్దూర్, బదిలీ ఉద్యోగి విభాగాలకు చెందిన 18 మంది ఎంపిక పరీక్షకు హాజరయ్యారు. రెస్క్యూ నైపుణ్యం పెంపు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన తీరు, రిస్క్ మేనేజ్‌మెంట్ నైపుణ్య అభివృద్ధి, జ్ఞాపక శక్తి, శారీరక ఫిట్‌నెస్, ప్రథమ చికిత్స వంటి అంశాలతో పాటు వ్యక్తిగత అంశాలపై ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వనున్నట్టు రెస్క్యూ అధికారులు తెలిపా రు. ఈ శిక్షణ ద్వారా సంస్థ అత్యవసర సమయాల్లో అవసరమైన సేవలను అందించడానికి, జాతీయ అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణికి ప్రాతినిధ్యం వహించే మహిళా రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయనున్నట్టు రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెస్క్యూ శిక్షణ కోసం మందమర్రి, కొత్తగూడెం ఏరియాల్లోని మహిళా ఉద్యోగినిల నుంచి దరఖాస్తులు వచ్చాయని, ఈనెల 13న భూపాలపల్లి ఏరియాలో ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్టు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇప్పటి వరకు 48 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న వారు 48 మంది, ఓసీపీల్లో పని చేస్తున్న ఏడుగురు ఉన్నట్టు రెస్క్యూ జీఎం తెలిపారు. ఈ ఎంపిక పరీక్షలను రెస్క్యూ సూపరిటెండెంట్ మాధవరావు, డీవైఎస్ఈ మూర్తి, అడిషనల్ మేనేజర్ తిరుపతి నిర్వహించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకుడు

రామగిరి, మే 9(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నాలుగు లేబర్ కోడుల రద్దు కోసం ఈ నెల 20న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనులను అమ్మకానికి పెట్టిందని, బొగ్గు పరిశ్రమలను సజీవంగా సమాధి చేస్తుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కృష్ణ, కుమారస్వామి, రాములు, ఏడుకొండలు, నరేష్, రాజేశం, క్రాంతి, తొట్లరాయమల్లు, శ్రీనివాస్, పోచయ్య, అశోక్‌లు పాల్గొన్నారు.

హక్కులను కాపాడుకేనేందుకే సమ్మె

గోదావరిఖని (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకే సార్వత్రిక సమ్మె అని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ప్రవీణ్ మాట్లాడారు. కేంద్రం 29 కార్మిక చట్టాలను నాలుగు చట్టాలుగా సవరించడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. దీని ద్వారా ట్రేడ్ యూనియన్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉన్నట్టు తెలిపారు. బొగ్గు పరిశ్రమను కాపాడుకనేందుకు దేశ వ్యాప్త సమ్మెకు నిర్ణయించినట్టు ప్రవీణ్ తెలిపారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు సమ్మెను విజయవంతం చేసి తమ స్ఫూర్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, నాయకులు వినేష్, సంతోష్, రాజేందర్, తిరుపతి, కిషోర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.